# ఆశ ఖరీదు రూపాయి

దేవరకొండ గంగాధర రామారావు

**రామస్వామి** నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ స్టేషనుకు వచ్చాడు. తన ఊరికి టికెట్టు కొనగా ఒక రూపాయిన్నర్ర మాత్రం మిగిలింది. ఆకలి దహించేస్తోంది. బండి రెండు గంటలు ఆలస్యం అని చెప్పాడు బుకింగ్ గుమాస్తా. చేతిలో ఉన్న ఆ కాస్త సొమ్మూ ఖర్చు పెట్టడానికి ఇష్టంలేక చాలా సేపు ఆలోచించాడు. ఏదో తినాలి, తప్పదు. ఇంటికి చేరేసరికి రాత్రి చాలా ఆలస్యం అవుతుంది. అయినా ఇంటి దగ్గర భోజనం ఉంటుందన్న నమ్మకం కూడా లేదు. అసలు ఈ పూట ఇంటి దగ్గర పెళ్ళాం పిల్లలు ఏమైనా తిన్నారో, పస్తులున్నారో తెలియదు!

రామస్వామి భారంగా అడుగులు వేసుకుంటూ స్టేషను బయట కొచ్చాడు. బజారంతా చాలా రద్దీగా ఉంది. ఓ చక్రాల బండి దగ్గర అర్ధ రూపాయకి నాలుగు మిరపకాయ బజ్జీలు తిని, ఓ చోట పంపు నీళ్ళు తాగాడు రామస్వామి. ఇప్పుడు ఆకలి బాధ కొంత ఉపశమించింది. అలసట మీద శరీరం విశ్రాంతి కోరుతోంది. రామస్వామి చుట్టూ కలయచూసి రోడ్డు పక్కన ఓ తూము గట్టు చూసి, వెళ్ళి దాని మీద కూర్చున్నాడు.

ఈ ఊళ్ళో ఏదో ఫాక్టరీలో గోడౌన్ గుమాస్తా ఉద్యోగం ఖాళీ ఉందని తెలిసి వచ్చాడు. కాని ఆ బస్తాలు లెక్క పెట్టే మేస్త్రీ ఉద్యోగానిక్కూడా రామస్వామికి అర్హత లేక పోయింది. "పదవ తరగతా? బి. ఎ. డిగ్రీల వాళ్ళే వస్తుంటే ఈ ఉద్యోగం నీ కెవ డిస్తాడయ్యా? వెళ్ళు, వెళ్ళు!" అని తరిమేశారు. రామస్వామి అభిమానం దెబ్బ తింది. ఇంత చిన్న పనికి కూడా పనికిరాని తను ఇంకీ ప్రపంచంలో ఏం చెయ్యగలడు? ఎందుకీ బ్రతుకు? పెళ్ళాం పిల్లలని పోషించుకోలేని ఈ దౌర్భాగ్య జీవితం సాగించడంకన్నా, ఏ రైలు కిందో తల పెట్టి... రామస్వామి తన ఆలోచనలకి తనే భయపడ్డాడు.

ఎదురుగా రోడ్డు పక్కగా ఓ జ్యోతిష్కుడు నేలమీద పంజరం, చిలక వగైరా పటాటోపం అంతా పెట్టి, అయిదు నిమిషాల కోసారి అరుస్తున్నాడు. వాడి అరుపులు రామస్వామిని ఆకర్షించాయి. జ్యోతిష్కుడు కంఠం అదోలా నొక్కి, మాటలు చిత్రంగా ఉచ్చరిస్తూ ధీమాగా చెపుతున్నాడు.

"ఒక్క రూపాయ్! ఒక్క రూపాయ్! మీ అదృష్టం పరీక్షించుకోండి. ముందు జీవితం ఎలా నడుస్తుంది? అనుకున్న కార్యములు నెరవేరుతవా? కోర్టు వ్యవహారము లాభిస్తుందా? ఉద్యోగము దొరుకుతుందా? యువతీ యువకుల ప్రేమ వ్యవహారములు సఫలమౌతవా?..." ఇలాగే వాడి దండకం చాలా పొడుగుంది.

అంత నిస్పృహలోనూ రామస్వామి వాడి మాటలు కుతూహలంగా విన్నాడు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, రామస్వామి ఇంతవరకూ ఎప్పుడూ జ్యోతిష్కులని సంప్రతించలేదు. అందులో అంత విశ్వాసమూ లేదు. ఇంతవరకు ఏదో మొండి నమ్మకం, జీవితంలో ఎలాగో పైకి రాగలడని. కాని ఈ రోజు ఆ నమ్మకం పోయింది. ఆశ నశించింది. మానసికంగా రామస్వామి ఓడిపోయాడు. ఇంకా బ్రతకాలంటే అతనికి కొత్త ఊపిరి, ఒక ఆలంబన కావాలి. అలాటి ధైర్యం ఈ జ్యోతిష్కుడి దగ్గర లభిస్తుందనిపించింది అతనికి.

తనకు తెలియకుండానే రామస్వామి జ్యోతిష్కుడి దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. రామస్వామికి తన బతుకెలా సాగబోతుందో తెలుసుకోవాలని చాలా ఆరాటంగా ఉంది. కాని, తన దగ్గర ఉన్నది ఒకే రూపాయ. అతను సందిగ్ధంగా కూర్చోవడం గమనించి జ్యోతిష్కుడు ప్రోత్సహించాడు. "సూపించుకో దొరా! నీ అదృష్టం సూపించుకో! సిలక సెపుతాది, నిజం సెపుతాది. నీకు లాభం కలుగుతుంది. మేలు జరుగుతుంది...సందేహించకు..."

రామస్వామి మాట్లాడకుండా జేబులోంచి రూపాయ తీసి వాడి ముందు పెట్టాడు. జ్యోతిష్కుడు రూపాయ తీసుకుని డబ్బీలో వేసుకుంటూ రామస్వామి అదిరిపడేలా ఏదో మంత్రం చదువుతూ పంజరంలో చిలకని బయటకు తీశాడు. చిలక ఒక్క క్షణం అటూ ఇటూ గెంతి ఓ పక్కన పెట్టిన అట్టల బొత్తి దగ్గరకు వెళ్ళింది. కొద్ది సెకన్లు నిశ్చలంగా వాటిని పరిశీలించి, తర్వాత పైనించి అయిదారు అట్టలు ముక్కుతో లాగి కింద పడేసింది. తర్వాత ఓ అట్ట నేర్పుగా ముక్కుతో కరచి, గిర్రున ఎగిరి జ్యోతిష్కుడి ముందరున్న గుడ్డమీద ఎర్ర గడిలో పడేసింది. జ్యోతిష్కుడు "సెబాస్" అని దాన్ని మెచ్చుకుని మళ్ళీ చిలకని పంజరంలోకి పంపి, కింద అట్ట తీసి రామస్వామి జాతకం చదవడం మొదలుపెట్టాడు.

"గొప్ప జాతకం దొరా, సీది. నీ చేతికింద పదిమంది బతకాల్సిందే. కానీ, నువ్వెవరికీ చాకిరీ చెయ్యవ్!"

గొప్ప జాతకం అనగానే రామస్వామికి శరీరంలో ఉత్సాహం విద్యుత్తులా ప్రవహించింది. అయితే తనింత దీనావస్థలో ఎందుకున్నట్టు? ఆ మాటే అడుగుదా మనుకున్నాడు. ఇంతలో జ్యోతిష్కుడే చెప్పాడు: "కానీ...నువు తల పెట్టిన పని ఏదీ సరిగా సాగదు. అది నీ తప్పు కాదులే. నీ క్కావలసిన వాళ్ళే నీ నాశనం కోరుతున్నారు" అని మీసాలు దువ్వుకున్నాడు.

నిజమే! రామస్వామి ఎందులోనూ రాణించలేకపోయాడు. పిల్లలకు పాఠాలు చెప్పడం దగ్గర నుంచీ బస్తాలు మోసే పని వరకూ రకరకాలు చేశాడు. అయితే ఎందులోనూ పట్టుమని పది రోజులు పనిచేసి పది రాళ్ళు సంపాదించిన పాపాన పోలేదు. కాని తన నాశనం కోరుకునే, వాళ్ళెవరై ఉంటారు? రామస్వామి మెదడు చురుగ్గా పనిచేసింది. ఆఁ..ఆ గోపాలంగాడు. వాడే ఉత్త వెధవ! ఏ పనిలో చేరినా 'ఎన్నాళ్ళుంటావో చూద్దాం లేరా!' అంటూండేవాడు. కుళ్ళుమోతు వెధవ! ఇప్పుడు వాడు చేస్తున్న పని తనకు రావలసిందే! 'ఫలానా ఉద్యోగం ఉందిట-చేరమంటావా!' అని వాణ్ణి సలహా అడిగితే, 'వద్దు, ఆ జూటు మిల్లులో పని చేస్తే గుండె తినేస్తుంది' అని తనని బెదరగొట్టి, వాడెళ్ళి కుదురుకున్నాడు. చిలక చిన్నదైనా గట్టిదే! రామస్వామి మరింత నమ్మకంతో వినడం ప్రారంభించాడు.

"నీ జీవితంలో ఇప్పటికి మూడు గండాలు తప్పినాయి!"

అవును, చిన్నప్పుడు జ్వరం వచ్చి చచ్చినంత పనైందని అమ్మ చెప్పేది. అయిదేళ్ళు నిండకుండానే నాన్న కళ్ళు మూశాడు. ఇక మూడోది-తన పెళ్ళైన కొత్తలో నీళ్ళు తోడుతూ జారిపడ్డాడు. ఆ పడడం ఇటు పళ్ళెంమీద పడ్డాడు కనక సరిపోయింది. నూతిలో పడుంటే గోవిందా! 'ఎంత గండం తప్పిందండీ!' అని తన భార్య తనను కావలించుకుని భోరుమని ఏడ్చింది. జ్యోతిష్కుడు మరింత హుషారుగా చెప్పాడు.

"మంచి రోజులు ముందున్నాయి దొరా! కాని ఇంకొక్క గండం తొంగి సూత్తా ఉంది. అది తప్పించుకుంటే నువ్వు తలచుకున్న పనులు జరిగిపోతవి. ధనలాభం కలుగుతుంది. ప్రజలలో మన్నన లభిస్తది. మనసుకు శాంతి, ఆరోగ్యం అన్నీ సక్కబడతాయి...చిలక మాట నమ్ముకో, ఏం?"

రామస్వామి సంతోషంతో ఉక్కిరి బిక్కిరైపోయాడు. ఇంత ఉజ్జ్వల భవిష్యత్తుండగా తను కొద్ది నిమిషాల క్రితమే ఆత్మహత్య గురించి ఆలోచించాడంటే ఎంత మూర్ఖత్వం! కాని వీడి జ్యోతిషం బంగారంగానూ- ఇంకో గండం గడవాలంటున్నాడు. అది గడిచే దెట్లా? ఆ విషయమే జ్యోతిష్కుడిని అడిగాడు. జ్యోతిష్కుడు మీసాలు దువ్వుకుని, కళ్ళు మూసుకుని అంతర్నేత్రంతో అంతా గ్రహించినట్టు చెప్పాడు.

"నిన్ను కొన్ని దుష్టగ్రహాలు ఆవరించుకున్నాయి. అవి నిన్ను వృద్ధిలోకి రాకుండా అణచివేస్తున్నాయి. కొందరు నిన్ను పక్కపోటు పొడవాలని చూత్తున్నారు. నీకు సేతబడులు సేయిత్తున్నారు..."

రామస్వామికి భయంతో ఒళ్ళు జలదరించింది. తన చుట్టూ ఇన్ని ప్రమాదాలున్నాయని ఇప్పుడే తెలుసుకున్నాడు. అయినా, తను ఎవరి కపకారం చేశాడనీ చేతబడులు చేయించడానికి? ఆఁ ఆఁ తను అద్దె కుంటున్న ఇంటాయనకి రెండో పెళ్ళాం. దాన్ని నేను వశం చేసుకుంటానేమోనని ఆ ముసలాడి భయం. అందుకనే కాబోలు ఈ ఇల్లు ఖాళీ చేయమని చేరిందగ్గరనుంచీ పోరు! ఆవిడేమో ఉండమని పట్టు. దాంతో ఆ ముండాకొడుక్కి అనుమానం మరింత దృఢపడి తనని ఈ ప్రపంచం నుంచే ఖాళీ చేయిస్తే శని




విరగడై పోతుందనుకున్నాడులా ఉంది. గండం తప్పే మార్గం లేదా అని రామస్వామి జ్యోతిమ్కుణ్ణి దీనంగా అడిగాడు. జ్యోతిమ్కుడు ఓ తాయెత్తు తీసి, అది కట్టుకుంటే ఏ ఆవదా దరి చేరదనీ, శాకినీ ఢాకినీ దయ్యాలు గాని, టక్కుటమార విద్యలు గాని, చేతబడులు గాని ఏం చెయ్యలేవనీ దాని మహోత్మ్యం వేనోళ్ళ వర్ణించి, దాని ఖరీదు రెండు రూపాయలని చెప్పాడు. కాని, రామస్వామి దగ్గర ఒక్క పైసాకూడా లేదు. కాని, రామస్వామి తెలివి ఉపయోగించి తన దగ్గరున్న బాల్‌పాయింటు పెన్ను జ్యోతిమ్కుడి కిచ్చి, తాయెత్తు కొనుక్కున్నాడు. జ్యోతిమ్కుడు దాన్ని రామస్వామి దండకు కట్టి "ఇక నీకు పోటీ లేదు పో!" అన్నాడు.

రామస్వామి అక్కడినుంచి బయటకు వచ్చాడు. అతనికి ఆకాశంలో తేలిపోతున్నట్టుంది. త్వరలో మంచి రోజులు వస్తాయన్న దృఢ విశ్వాసం ఏర్పడింది. అదే ఉత్సాహంతో ఆకలి, అలసట మరచిపోయి బజారంతా కాసేపు తిరిగాడు. మళ్ళీ కాళ్ళు లాగి తిరిగి ఇందాక కూర్చున్న గట్టు దగ్గర కొచ్చి కూర్చున్నాడు.

ఇంకా జ్యోతిమ్కుడి వ్యాపారం సాగుతూనే ఉంది. చుట్టూ జనం చేరారు. ఇద్దరు రైతు సోదరులలో ఒకతను జాతకం చూపించుకుంటున్నాడు. అప్పటికే చిలక తన పని పూర్తి చేసింది. జ్యోతిమ్కుడు కార్డు చదివి చెవుతున్నాడు. "గొప్ప జాతకం దొరా, నీది. ఎప్పుడూ నీ సేతికింద పది మంది పని సేత్తారు గాని, నీవు మాత్రం ఎవరిమీదా ఆధారపడవు." జాతకం చూపించుకుంటున్న ఈరయ్య తెల్లబోయి చూశాడు. అతని కూడా ఉన్న రెండో రైతు సోదరుడు కామయ్య జ్యోతిమ్కుడి మాటలకి వివరణ ఇచ్చాడు.

"ఓరోరి, ఈరయ్య మావాఁ! నీ యవ్వారమంతా సిలక పసిగట్టి సింది రోయ్! అవున్లే, కాలు మీద కాలేసుక్కూకుని నాలు గొకరాలు ఎగసాయం సేయిత్తన్నావు. ఎప్పుడూ నీ సేతికింద పది మంది పనోళ్ళు. అదురుష్టవంతుడివిరా!"

"ఆ పొలం గిని నాదేంటిరా?" ఈరయ్య సందేహంగా అడిగాడు. కామయ్య మళ్ళీ వివరించాడు. "కవులుకి తీసుకున్నా వనుకో. అయితే, భూమిగలాయన ఏడనో పట్నంలో ఉన్నాడు. ఇక్కడ నువ్వే గదరా రాజువి! ఆఁ...చెప్పవయ్యా జ్యోతిమ్కుడూ" అన్నాడు ఉత్సాహంగా. వీళ్ళ ఉత్సాహం చూసి జ్యోతిమ్కుడు మరో రెండు మాటలు చేర్చాడు.

"నువ్వు ఆపీచరు కావలసిన వాడివి. అధికారం సెలాయిత్తావు."

"ఏలిముద్రగాణ్ణి. నే నాపీచరేంటిరా?" మళ్ళా ఈరయ్య కామయ్య నడిగాడు. కామయ్య తడుముకోకుండా చెప్పాడు.

"ఓరి ఎర్రిబాగులాడ! ఆపీచరంటే నీకు పెద్దోళ్ళు సిన్నప్పటినుంచి సదువు సెప్పి స్తే ఈపాటికి నువ్వు పెద్ద ఆపీచరై పోయి మమ్మల్నందర్నీ జైల్లో పెట్టించేద్దువన్న మాట. సదువు లేదు కనక నీ

ఎనక ఓ పాతిక మందీని తిప్పుకుని పంచాయితీ నంబరైపోయావ్! అది ఆపీచరు కాదంటావా?"

ఈరయ్య సంతృప్తి పడి నవ్వుకున్నాడు. జ్యోతిష్యుడు మళ్ళీ చెప్పాడు. "నువ్వనుకున్న పని సరిగా జరగదు..."

ఈరయ్య విచారంగా ముఖం పెట్టాడు. కామయ్య వ్యాఖ్యానంతో సిద్ధంగా ఉన్నాడు. "కరకట్టుగా సెప్పావయ్యా! ఈరయ్యా, గుర్తు చూసుకో. నువ్వు ముందు నాటి పనలీకి సెరుకు నాటావా, వరదొచ్చి కుళ్ళిపోయింది. మళ్ళీ పనలీకి వరి ఊడ్చావా, దోమకాటొచ్చి ఎకరానికి ఆరు కాడికి మాత్రం రాలింది. ఈ ఏడు పెద్దోడి పెళ్ళి తలపెట్టావు. చివరదాకా వచ్చి, కట్నంకాడ బెడిసి కొట్టింది...ఏమంటావ్?"

కామయ్య ఉదాహరణలతో సహా జ్యోతిష్కుడి మాటలు రుజువు పరచడంతో ఈరయ్య విచారంగా ముఖం పెట్టుకున్నాడు. "నీక్కావలసినోళ్ళే నీ నాశనం కోరుకుంటున్నారు. నీకు సేతబడులు సేయిత్తున్నారు." జ్యోతిష్కుడు భయంకరంగా చెప్పాడు. ఈరయ్య నిస్సహాయంగా కామయ్య కేసి చూశాడు. కామయ్య భాష్యం చెప్పాడు.

"ఈరయ్య మావాఁ, నేను అందరికి తల్లో నాలుకలా గుంటాను కదా-నాకు సెత్రువు లేంటి అనుకోమోకు. అక్కడే ఉంది కిటుకు. నవ్వుతో గొంతులు కోసే దొంగనాయాళ్ళుంటారు లోకంలో."

"నా కెవరున్నార్రా?" ఈరయ్య భయంగా అడిగాడు.

"ఎవరేందెహె! ఆడే, నీ బామ్మర్ది! మొన్న నూకాలమ్మ జాతరనాడు తాగేసి, మాబావగాడి ఈరయ్యగాడి గీర అణిచేత్తానంటూ అరుపులు. అదీకాక నువ్వు పంచాయితీ నంబరయ్యావా. నీతో పోటీ సేసి ఓడిపోయిన్నా కొడుకు నూత్తా కూకుండాడేటి! సేతబడులూ సేయిత్తాడు, పేసలూ తీయిత్తాడు" అని కామయ్య కండువా దులిపాడు. "నాకు బయమేత్తందిరా!" అంటూ ఈరయ్య వణకిపోయాడు. ఇలాగే జరిగింది తక్కిన జోస్యంకూడా. చిట్టచివరకు అన్నీ ఉండీ ఈరయ్య ప్రాణాపాయంతో ఉన్నాడని తేల్చారు. ఈరయ్యకు ఏ అపకారం జరక్కుండా, ఏ దుష్టగ్రహాలు దరి చేరకుండా ఓ పది రూపాయలు పెట్టి తావీదులూ, రక్షరేకులూ కొనుక్కుని మరీ వెళ్ళారు. వెళుతూంటే కామయ్య ధైర్యం చెప్పాడు. "ఈరయ్యా, ఓ పది రూపాయలు ఖర్చు అయిందని దిగులుపడకు. ఈయాలనుంచి నీ శని యిరగడై పోయినట్టే. యిక నీకు పెసిడెంటు గిరి దక్కేసినట్టే!" ఈరయ్య మొహం వికసించింది. అందరూ ఉత్సాహంగా వెళ్ళిపోయారు.

రామస్వామి అంతా ఓర్పుగా విన్నాడు. జ్యోతిష్కుడు తనకు చెప్పిన మాటలే సరిగ్గా ఈరయ్యకి చెప్పాడు. జ్యోతిష్కుడు చెప్పినవి అక్షరాలా తన జీవితానికి అన్వయించుకుంటే, అంత 'కరకట్టు'గానూ ఈరయ్యకీ అన్వయించాయి. అంతా విచిత్రంగా, మాయగా ఉంది.

ఇంతలో బండి టైమయింది. రామస్వామి స్టేషనుకు వచ్చేశాడు.

రైల్లో ప్రయాణం చేస్తున్నంత సేపూ రామస్వామి తన జ్యోతిషం సంగతే ఆలోచిస్తున్నాడు. జ్యోతిష్కుడి మాటల మీద విశ్వాసం పోయింది. నాలుగెకరాల వ్యవసాయం, పంచాయితీలో నంబరు, ఇల్లూ వాకిలీ అన్నీ ఉండి పోతులా ఉన్న ఈరయ్యకీ, వారానికి మూడు రోజులు పస్తులుంటున్న తనకీ ఒకే జాతక మేమిటి? రామస్వామి కొక విశ్వ రహస్యం గోచరించినట్లయింది. నూటికి 99 మందికి ఆత్మవిశ్వాసం ఉండదు. ఎప్పుడూ ఏదో అదృష్టం వెతుక్కుంటూంటారు. స్వయంకృషివల్ల పైకి రాగలమన్న విశ్వాసం ఉండదు. తన పతనానికి కారణం తను తప్ప ఎవరో అనుకుంటాడు. ప్రతివాడికి శత్రువు లుంటారు. లేకపోయినా ఎవరో శత్రువులు తనని నాశనం చేస్తున్నారని నమ్ముతాడు. దుష్టగ్రహాలూ, చేతబడులూ నమ్ముకుని వాటి నివృత్తి కోసం సకల ప్రయత్నాలూ చేస్తాడు. ఇది మహారాజు దగ్గర నుంచి ముష్టివాడి వరకు ఉన్న బలహీనత! ఆ బలహీనతలో డబ్బుంది. రామస్వామి ఊరు చేరేలోగా ఓ నిర్ణయం చేసుకున్నాడు.

> టీచర్: మీ నాన్నగారి వయె స్సెంత?"
> రాజు: 35 ఏళ్ళండి.
> టీచర్: ఆయన వయస్సుకు తగినట్టే హెూమ్‌వర్క్ ఇస్తాలే.
>
> -జి. బాబురెడ్డి

xx xx xx

తణుకు బజారు చాలా రద్దీగా ఉంది. రోడ్డు జనంతో క్రిక్కిరిసిపోయి ఉంది. ఎప్పుడూ అలాగే ఉంటుంది. కార్లు, బస్సులు, స్కూటర్లు, సెకిళ్ళు, రిక్షాలు, మనుషులు, పందులు...అన్నీ ఒకే దారిలో వెళ్ళాలి. అది ఆ ఊరి దౌర్భాగ్యం. వ్యాపారాని కదే మహా భాగ్యం. చుట్టుపక్కల పది, పదిహేను గ్రామాల ప్రజలు మందుల కోసం, సినిమాల కోసం, వినోదం కోసం, విలాసం కోసం ఈ ఊరొచ్చి పడతారు. ఈ మురికి నగరాన్ని దర్శించడానికి వచ్చే కొన్ని వేల మందిలో కనీసం కొన్ని వందల మందైనా నిరాశా, నిస్పృహలతో తల్లడిల్లిపోతుంటారు. లేదా పేరాశతో, గ్రహబాధలతో, కీర్తి కండూతితో, కక్షలతో, కార్పణ్యాలతో వేగిపోతుంటారు. వాళ్ళందరికీ ముందు జరగబోయేది తెలియాలి. వాళ్ళకి అదృష్టం కలిసిరావాలి. ఈ సంతృప్తి కోసం ఒక రూపాయ దగ్గర నుండి యాభై రూపాయల వరకు వదులుకోగల చొరవ, అవసరం వాళ్ళ కుంది. అనేక రకాల జ్యోతిష్కులూ, భూతవైద్యులూ వీళ్ళ అవసరం తీరుస్తుంటారు.

రోడ్డుకు పక్కగా ఓ జ్యోతిషమార్తాండుడు మైకు చేత్తో పుచ్చుకుని, కంచు కంఠంతో గంభీరోపన్యాసం దంచుతున్నాడు. అతని చుట్టూ జనం పోగయ్యారు.

"ఒక్క రూపాయి మాత్రం! మీ అదృష్టం పరీక్షించుకోండి. దుష్ట గ్రహాలనుండి రక్షించుకోండి. శాకినీ, ఢాకినీ, టక్కుటమారాలు, చేతబడులు మిమ్మల్ని అంటకుండా రక్షరేకులున్నాయి..."

xx xx xx

ఆ జ్యోతిష్కుడు రాత్రి తన సరంజామాఅంతా మోసుకుని ఇంటికొచ్చాడు. భార్య అతని చేతిలో పంజరం, ఇతర వస్తువులు అందుకుంటూ అడిగింది—"ఇవాళెంత వచ్చిందండీ?" రామస్వామి గర్వంగా భార్య ముఖంలోకి చూస్తూ "యాభై!" అని భార్య బుగ్గమీద చిటిక వేసి, పెరట్లోకి వెళ్ళాడు ముఖం, కాళ్ళూ కడుక్కోవడానికి. భార్య భోజనానికి ఏర్పాట్లు చేసింది. రామస్వామి జీవితంలో స్థిరపడ్డాడు.

★

# భారత సూక్తము

> ప్రియములు వాయుటయును న
> ప్రియములు పెనబొందుటయును బెల్లుగ నగు ద
> త్క్రియలందు మూఢమతికి హృ
> దయ తాపము వాయదెపుడు దరికొను చుండున్...
>
> 1-5-140

ప్రియమయినవి దూరం అవుతాయి. అప్రియం అయినవి మీద పడతాయి. అలాంటప్పుడు మూర్ఖునికి హృదయతాపం మొదలవుతుంది. అది అతణ్ణి విడువదు. దహించి వేస్తుంది.

జీవితం ద్వంద్వాలతో కూడింది. సుఖం-దుఃఖం, ఆరోగ్యం-అనారోగ్యం, సంపద-దరిద్రం, వెలుగు-నీడ, వెన్నెల-చీకటి. బ్రతుకు వీటితో నిండి ఉంది. వీనిలో ఏదీ నిత్యం కాదు. అన్నీ మారుతుంటాయి. జీవితంలో స్థిరంగా ఉండేది ఏదీ లేదు. మార్పు ప్రకృతి సహజం; ప్రకృతి స్వభావం. ఇది తెలుసుకున్న వాడు జ్ఞానం కలవాడు. కానివాడు మూర్ఖుడు.

అందరికీ ప్రియం అయిన పదార్థాలు ఉంటాయి. అవి ఎప్పుడూ ఉండవు. దూరం అవుతాయి. అంతేకాదు. అతనికి గిట్టనివి ఉంటాయి. అవి దరి చేరుతాయి. మూర్ఖుడు అయినవాడు ప్రియం దూరం అయినందుకు, అప్రియం దరి చేరినందుకు విలవిల్లాడుతాడు. అతని గుండెలో తాపం చేరుతుంది. అది పొగ అయి, సెగ అయి, మంట అయి అతనిని కాల్చేస్తుంది.

> పగపున దేజోహీనుం
> డగు నాత్మహిత క్రియలకు నక్షముడగు న
> వ్వగపు దొరగి యుద్యోగము
> దగ జేయగ గలుగు సంచితములగు శుభముల్.
>
> 1-5-142

దుఃఖం మనిషిని తేజోహీనుణ్ణి చేస్తుంది. అలాంటి వాడు తనకు మేలు చేయగల పనులకు పూనుకోలేడు. ఆ దుఃఖాన్నీ, చింతనూ వదులుకున్నవాడు పని చేయడానికి ఉత్సాహవంతుడు అవుతాడు. అందువల్ల శుభములు సాధించగలడు.

పై పద్యంలో చింత మనసును మంటల పాలు చేస్తుంది అని చెప్పాడు. మనసులో దుఃఖం గూడు కట్టుకున్న వాడు ఏ పనీ చేయలేడు, క్రుంగి కృశించడం తప్ప. జ్ఞానం కలవాడు వాస్తవం తెలుసుకుంటాడు. పాము కుబుసాన్ని విడిచినట్టు దుఃఖాన్నీ, చింతనూ విడిచేస్తాడు. మనసు మంట ఆర్పగలవానికి తేజస్సు కలుగుతుంది. ఉత్సాహం ఉరకలు వేస్తుంది. అప్పుడు అతడు మంచి పనులకు ఉపక్రమిస్తాడు. సత్ఫలితాలు సాధించగలడు.

-దాశరథి రంగాచార్య